క్లుప్తంగా

దరఖాస్తులు ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: అంబేడ్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యానిధి పథకం కింద విదేశాల్లో విద్యనభ్యసించే ఎస్సీ విద్యార్థులకు ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించగా అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీడీవో డాక్టర్ వి.రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూఎస్ఏ, కెనడా ఆస్ట్రేలియా, సింగపూర్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా న్యూజిలాండ్, యుకే వంటి దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సులు చదవాలనుకునే ఎస్సీ విద్యార్థులకు రూ. 20లక్షలు అందించనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 19 వరకు www.telangana.epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో అర్హులైన వారు తమ వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా వాసులు అయి ఉండి రూ.5లక్షల్లోపు వార్షికాదాయం, డిగ్రీలో 60 శాతానికి పైగా మార్కులు, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ, జీమ్యాట్ వంటి పరీక్షలో ఉత్తీర్ణత, పాస్‌పోర్ట్, వీసా ప్రధాన అర్హతలుగా పేర్కొన్నారు. ఎస్సీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 79893 84801 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పోలీసులకు సమాచారం అందించాలి

ఎల్లారెడ్డిపేట: దసరా, బతుకమ్మ పండుగలకు గ్రామాలకు వెళ్లేవారు ముందస్తు సమాచారం అందించాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. సొంత ప్రాంతాలకు, బంధువుల ఇళ్లు, విహారయాత్రలకు వెళ్లేవారు దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తే తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎస్సై రాహుల్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులపై దృష్టిసారించాలి



ముస్తాబాద్: విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులతో బుధువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా కళాశాలకు పంపేలా చూడాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. రానున్న పరీక్షలకు విద్యార్థులను సిద్ధంచేసి, ఉత్తమ ఫలితాల సాధనకు సహకరించాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెకానిక్‌లకు స్టడీ టూర్

సిరిసిల్లటౌన్: ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు జిల్లాలోని పంప్‌సెట్ల మెకానిక్‌లు బుధవారం స్టడీటూర్‌కు బయల్దేరారు. మోటార్ పంప్స్ రంగంలో ప్రఖ్యాతి పొందిన టెక్స్మో ఇండస్ట్రీస్ సంస్థ మెకానిక్‌లకు సాంకేతిక నైపుణ్యాన్ని పెంచేందుకు అధ్యయన సమ్మిట్‌లను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలోని టెక్స్మో అధీకృత డీలర్ సంతోష్ ఎలక్ట్రికల్స్ అండ్ ఇంజినీరింగ్ స్టోర్స్ ఆధ్వర్యంలో కోయంబత్తూర్ టెక్స్మో ఇండస్ట్రీస్ ప్రధాన కార్యాలయానికి జిల్లాకు చెందిన మెకానిక్‌లు ముప్పై మంది బయలుదేరి వెళ్లారు. టెక్స్మో డీలర్ చింతోజు భాస్కర్, చింతోజు నారాయణ, దుర్గయ్య చారి, శ్రీనివాస్ రెడ్డి, పోశెట్టి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని గిద్ద చెరువు పక్కన మార్కెట్ యార్డు స్థలం కోసం అధికారులు బుధవారం పరిశీలించినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ఇరిగేషన్ ఏఈ భాస్కర్ రెడ్డి, డీఏ రత్నం, రెవెన్యూ రికార్డు అసిస్టెంట్ రమేశ్ అధికారులతో స్థలాన్ని పరిశీలించారు. కూరగాయల మార్కెట్‌తో పాటు మాంసం, చేపల అమ్మకాల కోసం ఈ మార్కెట్ యార్డును పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మిందె శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, నాయకులు పందిర్ల శ్రీనివాస్, అనవేని రవి పాల్గొన్నారు.

గిద్దె చెరువు మత్తడి వద్ద నీటి లీకేజీ



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని గిద్దె చెరువు నిండుకుండలా మారగా నీటి లీకేజీతో ఆయకట్టు రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. రెండు మూడు రోజుల్లో మత్తడి దుంకుతాయని ఎదురుచూస్తుండగా బుధవారం నీటి లీకేజీతో వృథాగా పోతోంది. వెంటనే నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి నీటి లీకేజీ కలుగకుండా మరమ్మతు చేయాలని కోరుతున్నారు.



తీరొక్క పూలతో బతుకమ్మ



మహిళలందరికీ ఇష్టమైన పండుగ బతుకమ్మ. ఈ పండుగకు అందరం కలిసి బతుకమ్మ ఆడడం ఎంతో సంతోషంగా ఉంటుంది. ఏటా తీరొక్క పూలతో బతుకమ్మ పేరుస్తాం. ఇంట్లో రోజూ సందడిగా ఉంటుంది. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి ఆడుకునే పండుగ బతుకమ్మ పండుగ. పండుగ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తుంటాం.

– చంద్రకళ, బోయినపల్లి

తొమ్మిది రోజులు సందడి



బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజులు ప్రతీ ఇంట్లో సందడి నెలకొంటుంది. రోజు వివిధ రకాల పూలు సేకరించి అందంగా బతుకమ్మ పేర్వడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. ప్రకృతి ప్రసాదించిన పూలతో బతుకమ్మను కొలవడం తెలంగాణకు ప్రత్యేకంగా చెప్పొచ్చు. మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే పండుగ ఇది.

– కొండవేని లాస్య, బోయినపల్లి

డ్రెస్ కోడ్‌తో ఉత్సవాలు



ప్రతీ సంవత్సరం దేవీ నవరాత్రి ఉత్సవాల్లో డ్రెస్ కోడ్‌తో పాల్గొంటాం. మా ఏరియాలో ఉన్న మహిళలు మొదట ప్లాన్‌తో ఒకే రకమైన డ్రెస్ ఏర్పాటు చేసుకుంటారు. ఒకే రకమైన చీరెలు ధరించి డ్రెస్ కోడ్‌తో బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొంటే ఎంతో సంబరంగా ఉంటుంది. ఇలా చాలా ఏళ్లుగా డ్రెస్ కోడ్‌తో ఉత్సవాల్లో పాల్గొంటున్నాం.

– మెరుపుల చందన, బోయినపల్లి

కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు



కోనరావుపేట: నిమ్మపల్లిలో దుర్గామాత మండపం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, తదితరులు

సిరిసిల్లటౌన్/కోనరావుపేట/ముస్తాబాద్/ఇల్లంతకుంట: జిల్లాలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బుధవారం సిరిసిల్లలోని గాంధీనగర్, మార్కెట్ ఏరియాలో ఏర్పాటు చేసిన శ్రీ తుల్జాభవాని సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో శ్రీ తుల్జాభవానీ సేవాసమితి అధ్యక్షుడు వలస చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సాప పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు. కోనరావుపేట మండలంలో దేవీ నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. పలు గ్రామాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ముస్తాబాద్ శివాలయం ఆవరణలో దుర్గమాత మండపంలో అమ్మవారికి గాజులతో ప్రత్యేక పూజలు చేశారు. హరీశ్‌చారి ఆధ్వర్యంలో చేసిన పూజల అనంతరం భక్తులకు గాజులు అందించారు. ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలకేంద్రంలోని హిందూ వాహిని ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

ఎల్లారెడ్డిపేట: రాజన్నపేట దుర్గామాత ఉత్సవ సమితి మండపంలోని అమ్మవారు బుధవారం అన్నపూర్ణదేవీగా దర్శనమిచ్చారు. మాజీ ఎంపీటీసీ నమిలికొండ శ్రీనివాస్, భక్తులు పూజలు చేశారు. ఎల్లారెడ్డిపేటలోని దుర్గాభవాని సేవా సమితి మండపంలోని అమ్మవారికి ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.



ఎల్లారెడ్డిపేటలో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ముస్తాబాద్‌లో దుర్గామాత మండపం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



ఇల్లంతకుంటలో..

భక్తిశ్రద్ధలతో కల్యాణం



ఎల్లారెడ్డిపేట : మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని శ్రీశివకేశవ ఆలయ పునర్ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా బుధవారం ఆలయ శిఖరంపై కుంభాభిషేకం, కల్యాణం నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో మూర్తిస్థిరీకరణ, పౌష్టికహవనములు నిర్వహించారు. ఈ వేడుకలకు భారీగా గ్రామస్తులు హాజరయ్యారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వైస్‌చైర్మన్ తిరుపతి, ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్లు వరస కృష్ణహరి, మాడుగుల మల్లేశం తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



మానేరువాగులో కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న మృత్యుంజయం

గంభీరావుపేట: గంభీరావుపేట, లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించారని, వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం అన్నారు. బుధవారం మానేరు వాగు వద్ద కొట్టుకుపోయిన రోడ్డును, వాగు ఉధృతిని పరిశీలించారు. ప్రయాణానికి అనుకూలంగా తాత్కాలికంగా ఏమైనా పనులు చేయవచ్చో అని ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత బ్రిడ్జిని కూల్చేసి దానిలోని ఇనుప చువ్వలను తీసుకెళ్లారని, ఏ కారణంతో ఏళ్లనాటి బ్రిడ్జిని కూల్చారో ఉన్నతాధికారులు విచారణ జరిపి సంబంధితశాఖ అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సంబంధిత కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టి, కాంట్రాక్ట్ రద్దు చేసి రీ టెండర్ జరిగేలా చూస్తామన్నారు. వచ్చే వానాకాలం నాటికి బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, నాయకులు గుర్రపు రాజుగౌడ్, పిట్ల వెంకటి, మల్యాల రాజవీర్, మల్లయ్య, ఎర్ర నర్సయ్య, కోట లింగం, బాలయ్య, శంకర్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు



రాజన్న ఆలయ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సిరిసిల్ల అర్బన్ : సెస్ ప్రభుత్వ బాలికల కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు



సిరిసిల్ల కల్చరల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ ఆవరణలో బుధవారం పట్టణ మహిళలు బతుకమ్మ ఆడారు. కోలాటాలు, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. అనంతరం ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్)లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. విశ్రాంత ప్రిన్సిపాల్ లాయక్ ఆలీ, విశ్రాంత లెక్చరర్ నసీరుద్దీన్, సర్దార్‌బచ్చన్ సింగ్, కోనరావుపేట కళాశాల ప్రిన్సిపాల్ రాజయ్య తదితరులు హాజరై బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారి వివేకానంద, శ్రీధర్, కేదారేశ్వర్, వెంకటేశం, చంద్రమౌళి, రాజయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరిసిల్ల అర్బన్: పట్టణంలోని సెస్ ప్రభుత్వ బాలికల కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలు అందంగా పేర్చి ఆట పాటలతో సందడి చేశారు. విశ్రాంత డిగ్రీ కళాశాల లెక్చరర్, వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షురాలు రూప్సీ శుక్లా హాజరై పండగ విశిష్టతను విద్యార్థినులకు వివరించారు. కళాశాల లెక్చరర్స్ మురళి, సీతారాము, సునీత, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, అఫ్రోజ్ సుల్తానా, సునీత, షాహిదా, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజ విద్యార్థినిలు, అధ్యాపకులు, మమత, నయుముద్దీన్, మల్లారెడ్డి, శ్రీనివాస్ దేవరాజ్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ మొగిలి

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో బుధవారం రాత్రి సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడపవద్దని, విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట: ఇటీవల వరద తాకిడికి గురై నష్టపోయిన కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఎల్లారెడ్డిపేట ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర వస్తువులు అందించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని 25 కుటుంబాలు, గంభీరావుపేట మండలంలోని నర్మాలలో 18 కుటుంబాలకు, గంభీరావుపేటలో 8 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 5వేల విలువైన 27 రకాల నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కోదండ రాములు, వైస్ డిస్టిక్ గవర్నర్ బద్రేశం, జోన్ చైర్‌పర్సన్ కోట సతీశ్ పీడీజీ అనంతుల శివప్రసాద్, జీఎల్‌టీ కోఆరినేటర్ ఇనగుర్తి రమేశ్, ఎల్లారెడ్డిపేట లయన్స్ క్లబ్ బాధ్యులు నందికిషన్, ముత్యాల శ్రీనివాస్ రెడ్డి, పయ్యావుల రామచంద్రం, నాయిని భాస్కర్ రెడ్డి, సద్ది లక్ష్మారెడ్డి, రావుల ముత్యం రెడ్డి, గొర్రె మల్లేశ్, పెంజర్ల రవి, కొమిరిశెట్టి తిరుపతి పాల్గొన్నారు.

వైద్యశిబిరం

గంభీరావుపేట: మండలకేంద్రంతో పాటు కొత్తపల్లి ఆరోగ్య ఉపకేంద్రాల్లో స్వస్థ్ నారి, సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు ధనరాజ్, నెఫ్రాలజిస్ట్ నాగార్జున వృద్ధులు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటికి సంబంధించిన వ్యాధులపై పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

కోనరావుపేట: మామిడిపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ప్రణీత్‌కుమార్, సూపర్‌వైజర్లు రషీద్, మెర్సీ, ఏఎన్ఎం వరమ్మ, ఆశాకార్యకర్తలు సుజాత, జ్యోతి, రమణ, బాబాయి, రజిత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

ముస్తాబాద్: పట్టణంలో ప్రధాన రహదారిలో వెలిసిన ఫ్లెక్సీలకు అనుమతులున్నాయా అని బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు గూడూరి భరత్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు నవాజ్ ఆర్‌టీఐ ద్వారా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం కోరారు. మెయిన్ రోడ్డు వెంట ఇరువైపులా ఉన్న ఫ్లెక్సీలకు ఎలాంటి అనుమతులు ఇచ్చారో చెప్పాలని కోరామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న చర్యలు ఎందుకు తీసుకోలేదో చెప్పాలన్నారు. ప్రశాంత్, గుణశేఖర్ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

- **విరాళం అందజేత**

వేములవాడ: రాజన్న గోశాలకు హైదరాబాద్‌కు చెందిన సుమన్‌శర్మ దంపతులు 10 వీధిదీపాలకు సంబంధించి ఈవోరమాదేవికి విరాళం అందించారు. డీఈ రఘునందన్, ఏఈవో అశోక్‌కుమార్ ఉన్నారు.

- **ఓటరు జాబితా పరిశీలన**

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండలం రుద్రవరంలో నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఓటు చోరీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 211, 212 బూత్‌లలో ఓటర్ జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పిల్లి కనుకయ్య, చిట్ల శ్రీనివాస్, నాగమురళి, తదితరులు ఉన్నారు.

- **పీఎంయూవైని సద్వినియోగం చేసుకోవాలి**

ఎల్లారెడ్డిపేట: పీఎంయూవై పథకాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్త రేషన్ కార్డు వచ్చినవారు, గ్యాస్ కనెక్షన్ లేనివారు ప్రధాని మోదీ దసరా, దీపావళి కానుకగా మహిళలకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా కొత్తగా దేశంలో 25 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా అందజేశారన్నారు. మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

- **నిందితులపై చర్యలు తీసుకోవాలి**

సిరిసిల్ల అర్బన్: ఇటీవల జరిగిన సిరిగిరి రమేశ్ హత్యకు సంబంధించి సుపారీ ఇచ్చిన వ్యక్తులను గుర్తించి నిందితులపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు రాగుల రాములు అన్నారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఫిర్యాదులో ఉన్న పేర్లందరిపై కాల్ డాటా తీసి బాధ్యులను గుర్తించాలన్నారు. దళిత సంఘాల నాయకులు కంసాల మల్లేశం, శివ, సిరిగిరి పర్శరాములు, వెంకటేశ్, రాజు, రాహుల్, తీపిరి ఉమాశంకర్, సిరిగిరి చందు, శ్రీవర్దన్, తదితరులు పాల్గొన్నారు.

- **నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి**

ఇల్లంతకుంట: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకసిబ్బంది, పాల్గొన్నారు.

- **నిధులు మంజూరు**

కోనరావుపేట: మల్కపేటలో మున్నూరు కాపు సంఘ భవనానికి ఎంపీ బండిసంజయ్ నిధుల ద్వారా రూ.5 లక్షలు మంజూరైనటట్లు బీజేపీ మండలాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కౌన్సిల్ మెంబర్ గొట్టె రామచంద్రం, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, నాయకులు వేల్పుల మహిపాల్, తిరుపతి, ఎక్కల్‌దేవి జలేందర్, తదితరులు ఉన్నారు.

- **గుడుంబా స్థావరాలపై దాడులు**

వీర్నపల్లి: మద్దిమల్ల లొద్దితండా, బావుసింగ్ నాయక్ తండా పంచాయతీ పరిధిలోని గోల్యానాయక్‌తండా, భూక్యతండా, బంజరు, రాశిగుట్టతండాల్లో ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం గుడుంబా స్థావరాలపై దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 250 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సిబ్బంది రాజు, మల్లేశ్, వర్మ, రాకేశ్ పాల్గొన్నారు.

- **రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు**

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రం శివారులోని హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. రాచర్లబొప్పాపూర్‌కు చెందిన బిస్క నర్సింలు(35) బైక్‌పై వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ నర్సింలును ఆటోలో స్థానిక ఆస్పత్రికి తరలించారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి



చందుర్తి : అవగాహన కల్పిస్తున్న అధికారులు

చందుర్తి: మండలంలోని బండపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా అన్నప్రాసన, అక్షరాభ్యాసం పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య మాట్లాడారు. చిన్నారులు పోషకాహారంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం అందజేస్తున్నామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు న్యాత పద్మ, బుర్ర రేణుక, రేణుక తల్లులు, కిషోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని ఒకటో, దేగావత్ తండా, మంగలి తండా, బడితండా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత మాట్లాడుతూ.. శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ అర్చన, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, జ్యోతి, శారద, అనసూయ, కవిత, సరిత, నీలా, అరుణ, గంగామణి, పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు పద్మ, లక్ష్మి, సూర్య, చంద్రకళ, ఆయాలు లావణ్య, యశోద తదితరులు ఉన్నారు.

దివ్యాంగుడికి ద్విచక్రవాహనం అందజేత



గంగారాంకు ద్విచక్రవాహనం అందిస్తున్న శ్రీకుమార్

కోనరావుపేట: మండలంలోని కమ్మరిపేట తండా (వట్టిమల్ల)కు చెందిన వికలాంగుడు మాలోతు గంగారంకు చెన్నమనేని శ్రీనివాసరావు ట్రస్ట్ సహకారంతో మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీ కుమార్ ద్విచక్రవాహనాన్ని బుధవారం అందజేశారు. గంగారాం వికలాంగుడు కావడంతో నడవలేక కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్నాడు. శ్రీ కుమార్ మాట్లాడుతూ.. గతంలో పలువురికి ద్విచక్రవాహనాలు అందించినట్లు తెలిపారు. శ్రీ కుమార్‌ను తండా వాసులు ఘనంగా సన్మానించారు. తాజా మాజీ సర్పంచులు సూర్య నాయక్, గోపు పరశురాములు, వట్టి మల్ల మాజీ సర్పంచ్ జెట్టి అంజయ్య, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

గోవుల తరలింపు అడ్డగింత



గోవులను పట్టుకున్న బీజేపీ నాయకులు

రుద్రంగి: గోవులను సంరక్షించాలని బుధవారం రాత్రి రుద్రంగిలోని కోరుట్ల, వేములవాడ ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు బైటాయించారు. గంట సేపు ధర్నా చేయడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వేములవాడ నుంచి రుద్రంగి మీదుగా కోరుట్ల వైపు రెండు గేదెలు, ఒక ఆవు, ఒక ల్యాగను తీసుకెళ్తున్న వాహనాన్ని రుద్రంగిలో బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న రుద్రంగి ఎస్సై చేరుకొని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లుతో ఫోన్‌లో మాట్లాడించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, గోవులను గోసంరక్షణ శాలలకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నాలో బీజేపీ నాయకులు నంద్యాడపు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అడవిపందుల దాడిలో పంట ధ్వంసం

రుద్రంగి: మండలకేంద్రంలోని వెంకటేశ్వర ఆలయం ఆవరణలోని గాజ నర్సయ్య, దాసరి గంగరాజంకు చెందిన వరి పొలాన్ని అడవి పందులు ధ్వంసంచేశాయి. పొట్ట దశలో ఉన్న వరి పొలాన్ని ధ్వంసం చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.